# ది లాంగెస్ట్ డే

తెల తెలవారుతోంది.

సముద్రంలో నుంచి సూర్యుడు అందంగా హుందాగా లేస్తున్నాడు. లేస్తూనే తన పచ్చటి కిరణాల్ని ముందుగా ఎత్తైన ఖరీదైన భవనాల మీద ప్రసరించాడు. ఉషఃకాంతిలో పచ్చపచ్చటి మేడలు పసిడి కాంతుల్ని విరజిమ్ముతున్నాయి.

మేడల్ని, మిద్దెల్ని దాటుకుంటూ ఊరవతల కాలవదిగువున మురికి వాడలోకి కూడా వెలుగొచ్చింది. అక్కడ కాలవలో పారుతున్న కుళ్ళునీటిని, పాకల్ని, వాటి మధ్య తిరుగాడుతున్న నికృష్టుల్ని తాకేటప్పటి సూర్యుడికి కూడా చిరాకెత్తి తన కిరణాల్ని వాటిమీద చురచుర లాండించేడు.

''ఇంతేళయింది. ఇంకా తొంగున్నావేటి, లేలే! .. ఈ దరిద్రం సాల్దనా?'' అంటూ పడుకున్న పెళ్ళాన్ని కుదిపిలేపాడు టీ గ్లాసుతో వచ్చిన రిక్షా సింహాచలం.

''ఓరాత్రప్పుడు జెరం తగిలింది. కాల్లు నాగేస్తున్నాయి. నెగిస్తే బుర్ర ఇసిరేస్తంది. సిటం తొంగోనియ్యి – ఆ టీ నీళ్ళిచ్చి నువ్వెళ్ళు... ఇదిగో! నూకల్లేవు.. నువ్వొస్తే నే పొయ్యి రాజేస్తాను!'' అంది లచ్చుమ్మ పడుకునే మూలుగుతూ.

''ఏటి? మళ్ళీ జెరవొచ్చిందేటే!.....ఈ టీ తాగి తొంగో, తొంగో!.....రెక్క దగ్గెరేసుకో కుక్కలు జొరబడ గలవు.

''నువ్వు టీ తాగావా? ఇదిగో, జాగర్తగాఎల్లు, లారీలు, బస్సులు తిరుగుతుంటాయి గాచారం..''

ఉస్సురంటూ సింహాచలం రిక్షా తీసుకొని బయలుదేరాడు. బయలుదేరేముందు ఇంటికెదురుగా మర్రి చెట్టు క్రింద వెలిసిన మరిడమ్మని దణ్ణం పెట్టుకున్నాడు. ''దయసూడు తల్లో'' అనాథ ముండాకొడుకుని; బేరం దొరక్కపోతే మలమల మాడి సచ్చిపోతాను!'' అని.

అరవై సంవత్సరాలు దాటిన సింహాచలం అద్దె రిక్షా తొక్కుతున్నాడు. వయస్సుతోనూ, వయస్సుకు మించిన కష్టంతోనూ జీర్ణించుకుపోయిన సింహాచలం ముఖం ముడతలు తేరి బీటలు వేసిన చవిటి పర్రలా వుంది. ఆకలి నింపుకున్న కళ్ళు నిర్జీవంగా గాజు కళ్ళలా ఉన్నాయి. ఒడిలిపోయిన కాళ్ళ పిక్కల మీద నరాలు ముద్దలు ముద్దలుగా తన్నుకొచ్చి జీవితమంతా కష్టాలకు అలవాటు పడ్డ మనిషిగా కనిపిస్తున్నాడు.

స్టేషన్ రోడ్డు రద్దీగా వుంది. సింహాచలం జీవితంలాగే తనరిక్షా కూడా పాతపడి అరిగిపోయి కటకటమంటూ నడుస్తోంది. కార్లని, లారీల్ని, ఇతర రిక్షాల్ని జాగ్రత్తగా తప్పించుకుంటూ తీసికెళ్తున్నాడు.

''ఏయ్ రిక్షా!'' కారు హారను ''బాబయ్యా, పక్కకి తీసేస్తున్నాను. ఒక్కచిటం!''

.....

''ఇదిగో, ఓయ్ రిక్షా!.. గాడీ పక్కకి తప్పించి కాస్త చోటెట్టయ్యా; ముసిలోడ్ని''.

''ఎక్కడికి లాగే మంటావ్.. ముసిలోడివి రిక్షా తొక్కనేకపోతే మానేరాదా?''

''మానేస్తే నువ్వెడ్తావేటి కూడు?''.. అనుకున్నాడు మనస్సులో.

''ఇదిగో అమ్మా... తల్లోయ్! రోడ్డుకి అడ్డంగా నడుత్తావేం... పక్కకి తప్పుకో తప్పుకో!''

''లేచిపోతన్నాం... లేచిపోతన్నాం.. ఈ రోడ్డు నువ్వే గుత్త కొనేసిన్నా గుంది! ముసలోడు ఎలాగరుస్తున్నాడో, కాకి లాగ!''

''ఓలమ్మ, ఎందుకంత కోపవే? ముసిలోణ్ణి; సరిగ్గా సూపానదు, కాస్త ఒదిగి నడే అన్నాను. ఓలమ్మ ఎంత కోపమొచ్చిందే!.. ఔనోలమ్మ ఒయిసు కురుకురా బాతుకురుకురా!'' అని గొణుక్కుంటునే తొక్కుతున్నాడు .

రిషాని తొక్కుకుంటూ, లాక్కుంటూ జనంలోనుంచి తీసికెళ్తున్నాడు. ఇంతలో ఏడు గంటల పుంగా బోంయ్ మని ఊదింది.'' రైలుకు టైమయిపోవస్తోంది''. రిషాలు, కార్లు, టాక్సీలు, పందెం వేసుకున్నట్టు పరుగెడుతున్నాయి. వయస్సులో ఉన్నవాళ్ళు, బలమైనవాళ్ళూ 'టైమయి పోతోంది, పదేహే!' అంటూ ఒకర్నొకరు హెచ్చరించుకుంటూ టంగ్ టంగ్ లాడించు కుంటూ బలం పూర్తిగా తొక్కుతున్నారు. సింహాచలం కూడా రిషాదిగి కాలిమీద రసికారుతున్న దెబ్బకి కట్టిన కట్టుని మరింతకాస్త బిగించి లేని ఓపిక తెచ్చుకుంటూ గబగబా నాలుగడుగులు రిషాతోసి పడుచువాడిలా సీటుమీద ఎగిరి దబాలున కూర్చున్నాడు. కాసేపు కళ్ళు మూసు కున్నాడు. తేరు కొని ఒంట్లో ఇంకా మిగిలున్న బలాన్నంతా కూడగట్టుకొని తొక్కటం మొదలుపెట్టాడు. తక్కిన రిషావాళ్ళలాగ తనుకూడా ఎగిరెగిరి తొక్కుతున్నాడు. వాళ్ళలాగే హేయ్ హేయ్‌మని కేక లేస్తున్నాడు . జీరవోతున్న ముసలి గొంతుకతో వాళ్ళకంటే జోరుగా గంటని ఠాంగ్ ఠాంగ్ ఠంగు మని బాదేస్తున్నాడు. కాని తన రిషా మాత్రం పోటీ పడలేక వెనకబడిపోతోంది . చెమట్లు కక్కుకుంటున్నాడు.

''అవును , నేను ముసలాణ్ణయిపోయాను. కష్టపడదామన్నా కష్టపడలేను!'' అని అప్పుడను కొన్నాడు. అలాగని అప్పుడప్పుడు ఇంతకు ముందు కూడా చాలాసార్లు అనుకున్నాడు.

రొప్పుకుంటూ స్టేషనుకి వచ్చేసరికి రిషాస్టాండు అంతా నిండిపోయింది. బండి అరగంట లేటన్నారు. స్టేషనుకి ఎదురుగా రావిచెట్టు నీడలో రిషా నిలబెట్టాడు సింహాచలం. గుడ్డతో చెమట తుడుచుకొంటూ రిషాలో కూర్చున్నాడు. వయస్సుతో డీలాపడిపోయిన నడుం పీకేస్తోంది. కాళ్ళ మీద దెబ్బ జివ్వుజివ్వున లాగుతోంది.

''ఇలాటప్పుడు ఉడుకుడుకు టీ తాగితే బాగుణ్నని పించింది''.

''పొద్దుట తాగిన టీ ఫోర్సు రిషాలాగడం తోనే పట్టాగ్గేసింది'' అని అనుకున్నాడు. ఆశగా జేబులో పది పైసాల్ని చేత్తో తడుముకుంటూ శూన్యంలోకి వెర్రి చూపులు చూశాడు. దానితోనే సాయంకాలం దాకా గడపాలి. ఆకాశంమీదికి చూశాడు. ఎండచురచుర మంటున్నా ఇంకా సూర్యుడు నడి నెత్తికి రాలేదు.

''ఇప్పుడే తాగేస్తే సాయంకాలం దాకా ఎలా గడుస్తాది. బేరం తగుల్తాదో నేదో? ఛశ్! ఇప్పుడ ప్పుడే ఒద్దులే!'' అనుకున్నాడు. ఇలాటీలు తాగి ఎన్నాళ్ళు గడపాలో అర్థంకాక తలపట్టుకు కూర్చు న్నాడు.

ఏడు పొచ్చినట్లయింది. ఏడవటం మంచిది కాదనుకున్నాడు.

''ఛీ ఛీ ! ఏం బ్రతుకు. సావన్నా వస్తే బాగుండును!'' అని అనిపించింది.

దేవుడు సల్లటి సూపు సూస్తే మంచి రోజులు రాకబోతాయాఅని కూడా అనుమానంగా అనుకున్నాడు. ''సావు రోజులు దగ్గిర పడుతున్నాయి. ఇంకా మంచిరోజు ఎప్పుడిస్తాడు దేవుడు! ఏటో ఎర్రిగాని!'' అని అనుకున్నపుడు ఏడుపులో నవ్వులాంటిది కూడా వొచ్చింది. అప్పుడలా అనుకోడం దేవుడిని పరిహాసం చెయ్యడంలా తోచి గబుక్కున నాలిక్కరుచుకున్నాడు.

స్టేషనులోకి రైలు కంయ్‌మని అరుచుకుంటూ వచ్చింది.

స్టేషనులో కాకులు గుంపులు గుంపులుగా లేచి అరుచుకుంటూ చుట్టుపట్ల చెట్లమీద కూర్చుంటున్నాయి.

జనం గేటులోనుంచి చీమల పుట్టలా వస్తున్నారు.

సింహాచలం రిక్షా తీసుకొని గేటు దగ్గరకు పరిగెత్తాడు.

వస్తున్న ప్రయాణీకుల్ని రిక్షావాళ్ళు, జట్కావాళ్ళూ, టాక్సీవాళ్ళూ, అటకాయిస్తున్నారు.

''సార్''... ''సార్''... ''టాక్సీసార్... సీవ్యూ హోటల్... మెరీనా...''

''ఇదిగో అబ్బాయిగారు రిక్షాండి''... ''రిక్షాసార్.. మార్కెట్టుకా సార్''.. ''బస్సుస్టాండుకేటి బాబూ?'' ''ఇదిగో! ఇలారండిసార్''.. ''టాక్సీ అయితే చార్జీ ఎక్కువ చేసేస్తారు సార్... రిక్షాలో కూర్చోండి సార్''..

''ఏర్రా, రిక్షా! దవడ పేలిపోగల్దు. నీ బేరం నువ్వు చూసుకోక టాక్సీలోళ్ళకి ఎదురుచేస్తావేంటి. రిక్షానాకొడుకులికి కళ్ళు నెత్తికెలిపోయాయి. చూశి చూశి రేవెట్టేసామంటే ఒదిలిపోద్ది.''

''ఇదిగో తిట్టావంటే నీ టాక్సీ మరింక ఇంటికెళ్ళదు... టైర్లు బొక్కలెట్టీగలం''.

బేరాలకోసం టాక్సీ వోళ్ళూ రిక్షాలోళ్ళూ పోటీ పడుతున్నారు.

రిక్షావోళ్ళూ, రిక్షావోళ్ళూ పోటీపడుతున్నారు.

ఎవరికి దొరికిన బేరాల్ని వాళ్ళు కుదుర్చుకుంటున్నారు . టాక్సీలు రిక్షాలు ఊర్లోకి పరుగెత్తుతున్నాయ్.

బేరాల మధ్యలో సింహాచలం కూడా దూరాడు. తోసుకుంటూ రిక్షాలాక్కుంటూ పాసింజర్ల దగ్గరకి వెళ్ళాడు. వాళ్ళ వెంటబడ్డాడు. తోవకి అడ్డం పడ్డాడు. బ్రతిమిలాడాడు. కనికరించమన్నాడు. ముసిలోణ్ణయినా వొయిసినోళ్ళ కంటే బాగాతొక్కుతానన్నాడు.

''నువ్వు ముసలోడివి ఏమి తొక్కుతావులే; వ''ద్దన్నారు.

''వద్దులే, తాతా!'' అని కొందరు కనికరించారు.

''ఏంర్రా, చేస్తే నీక్కాదేమిటి? అడ్డు పడుతున్నావు!'' అని కసురుకున్నారు.

''డర్టీ ఫెలో.. అబ్బా! వీడి రిక్షావద్దు బాబూ!'' అని ముక్కుచిట్లించింది ఓ సుందరాంగి. మొత్తం మీద సింహాచలానికి బేరం తగల్లేదు.

తిరిగి చెట్టు నీడన రిక్షా నిలబెట్టి కూర్చున్నాడు. రాను రాను ఎండ ముదురుతోంది. ఎండకి భరించలేక కాకులు రావిచెట్టు కొమ్మల్లో కూర్చుని ఒగురుస్తున్నాయి. ఉండుండి తడారిపోయిన గొంతుకుత్తో దగ్గుతున్నట్లు కొక్కోక్కో మంటున్నాయి. దారినపోయే వాళ్ళవైపు ''వస్తారా బాబూ'' అన్నట్లు ప్రశార్థకంగా చూస్తున్నాడు . సింహాచలం అలసిపోయిన కళ్ళు ఆకలి

చూపులు చూస్తున్నాయి. అవి ఆకలిగొన్న సింహం కంటి చూపుల్లా లేవు. ఆకలితో అలమటించి పోతున్న కుక్క చూపుల్లా దీనంగా ఉన్నాయి.

అలా చాలా సేపు ఎదురు చూశాడు బేరాలకోసం సింహాచలం. మరో రైలు బండివచ్చింది. ఎక్స్‌ప్రెస్ .... వెళిపోయింది.

మెయిలొచ్చింది - దెయ్యాలబండొచ్చింది (ఆ పాసింజర్ని అలానే పిలుస్తారు) అవీ వెళ్లి పోయాయి. అన్ని బళ్ళలోనూ పాసింజర్లు బాగానే దిగారు. సింహాచలం రిక్షామాత్రం ఒక్కరూ ఎక్కకపోవటమో లేక ఎక్కిన తరవాత సింహాచలం ముఖం పరీక్షగా చూసి కూర్చోకుండా దిగి పోవటమో జరిగింది.

''మరి నాభం నేదిక్కడ! రేత్తిరికి గాని బళ్ళులేవు. మార్కెట్టు దగ్గరైనా బేరాల్తగుల్తాయేమో?'' అని మార్కెట్టు వైపు బయలుదేరడానికి లేచి సర్దుకున్నాడు. కడుపులో ఆకలికూడా మెల్లమెల్లగా రాజు కొంటోంది. మళ్ళా జేబులో పదిపైసాలు తడుముకొని ఆకాశంవైపు చూశాడు తలెత్తి. నడినెత్తి మీదసూర్యుడు అగ్నిగోళంలా మండుతున్నాడు. ''ఇప్పుడు టీ తాగుతే ఫరవాలేదు. సాయంకాలం దాకా నాగీవొచ్చు'' ననుకున్నాడు. బడ్డీలో టీ తాగి మార్కెట్టు వైపు బయలు దేరాడు.

చుట్టు పక్కల రిక్షాలు కనిపించటంలేదు. ''బహుశా రైలు బళ్ళు లేవని గాబోలు, ఊళ్ళోకి వెళ్లిపోయా'' యనుకున్నాడు సింహాచలం.

రెండు టాక్సీలు దూసుకు పోయాయి. వాటిలో కూడా మనుషులు లేరు. దూరంగా కొన్ని రిక్షాలు వస్తున్నట్టు కనిపించాయి. అవికూడా మలుపు తిరిగి మార్కెట్టువైపు ఆదరాబాదరాగా పోతున్నాయి.

''ఏయ్ రిక్షా! ఆగు, ఆగు!'' వెనకనుంచి పిలుపొచ్చింది.

సింహాచలానికి పెన్నిధి దొరికినట్టయింది. ఒక గళ్ళ చొక్కావ్యక్తి పరుగెత్తుకుంటూవచ్చాడు. నల్లటి కళ్ళద్దాలు పెట్టుకొని మోటుగా ఉన్నాడు.

''మార్కెట్టుకి పద!'' అని రిక్షా ఎక్కుతున్నవాడల్లా క్షణంసేపు అటూ ఇటూ చూసి ''తొందర గా పోవాలి.. నువ్వు ముసలోడివి తొక్కగలవా.. ఇంకెక్కడా రిక్షాలు లేవేవిటి?'' అని ఎదురు ప్రశ్న వేసాడు సింహాచలానికి.

దొరికిన పెన్నిధి అమాంతంగా మాయమైపోతున్నట్లు అనిపించింది సింహాచలానికి. అలా కాకూడదని ఇంటిముందర మర్రి చెట్టు మరిడమ్మకి కూడా గట్టిగా దణ్ణం పెట్టుకున్నాడు.

''అదేవిటి, బాబయ్యా; అలా అంటారేంటి! మీరు కూకోండి. నాను తీసికెళ్ళ నేకపోతేకదా!'' అని రిక్షా ఎక్కాడు సింహాచలం.

''ఊఁ! ఊఁ.. త్వరగా పోవాలి!'' అంటూ అప్పటికే కదిలిపోతున్న రిక్షా ఎక్కి కూర్చున్నాడు గళ్ళ చొక్కా ఆసామి.

''బేరం ఆడకుండా ఎక్కించేశాను. ఇప్పుడు అడుగుదునా? ఊఁ, సరేలే ; ఏదో ఒక బేరం! ఇదీ దొరక్కపోతేనో!?'' అని తన్ని తాను సముదాయించుకున్నాడు.

సైకిలు జమాయించి తొక్కుతున్నాడు. టైర్లు అరిగిపోయిన బండి డౌనులో గెంతుకుంటూ పరుగెడుతోంది. గళ్ళ చొక్కా వ్యక్తి రెస్ట్‌లెస్‌గా టాపు క్రింది నుంచి వంగి వంగి రోడ్డు మీదకి చూస్తు

న్నాడు. ఉండుండి క్రీచ్ క్రీచ్ మని బ్రేకులు వేస్తున్న సింహాచలాన్ని చిరాగ్గా కూడా చూస్తున్నాడు.

వెనకనుంచి టాక్సీ ఒకటి రయ్‌మని వచ్చి పక్కనుంచి దూసుకుపోయింది.

''అరె... అరె.. అప్పన్నా.. అరే, అప్పన్నా!.. ఆపు.. ఆపు'' అని రిక్షాలోంచి టాపు సందులో నుంచి తలపైకెట్టి ఎగిరెగిరి కేకలేసాడు గళ్ళ చొక్కా. టాక్సీకి ఆ కేక వినబడలేదు. గాలిలా పోయాడు.

''ఎందుకు బాబూ టాక్సీ? ఇద్గిదో సగం ఒచ్చేశాం కదా.. మరింకెంత, నాన్నీసికెల్ల నేకపోతే గదా!?'' అన్నాడు సింహాచలం అనుమానంగా తొక్కుతూ.

''అదికాదు లేరా, బాబూ!... నీ సొదనీది.. త్వరగాపోనీ.. ఊఁ! ఊఁ!'' అని సాలోచనగా పెదాలు కొరుక్కుంటూ అన్నాడు గళ్ళ చొక్కావ్యక్తి.

రోడ్డు ఇప్పుడు ఎగుడుగా ఉందేమో సింహాచలం కటకటలాడిపోతున్నాడు. గళ్ళ చొక్కాని కాస్త దిగమందామనుకున్నాడు. కాని దిగుతే తిరిగి ఎక్కడేమోనని భయం వేసింది. అలానే రొప్పుతూ, రొజుతూ, మూలుక్కుంటూ సైకిలు రిక్షా తొక్కుకుంటా మార్కెట్టు మలుపు తిప్పాడు.

అక్కడ దృశ్యం చూడగానే సింహాచలానికి గుండె జల్లుమంది.

మార్కెట్టు జంక్షను గందరగోళంగా ఉంది. జనం అటూ ఇటూ పరుగెత్తుతున్నారు. రెండు టాక్సీలు కాలిపోతున్నాయి. వాటి మంటల్లో నుంచి లుంగలుంగలు చుట్టుకుంటూ లేస్తున్న నల్లటి పొగలు ఆ ప్రాంతాన్నంతా అలిమేస్తున్నాయి. రబ్బరు కాలుతున్న ఘాటు వాసన నలువైపులా కొడుతోంది.

ఇదంతా అర్థంకాక మెల్లమెల్లగా బ్రేకులు బిగిస్తున్న సింహాచలం చేతిలో రూపాయి నోటు పెట్టి రిక్షాలోంచి గభాలున సింహంలా దూకాడు గళ్ళచొక్కా వ్యక్తి. గళ్ళ చొక్కాని చూడగానే ''ఇదిగో, వచ్చాడ్రాబాబు!'' అంటూ జనంలో నుంచి పది పన్నెండు మంది అతని దగ్గరకు పరుగెత్తు కొచ్చారు. వాళ్ళ చేతుల్లో కారు హేండిల్సున్నాయి. ఇనప రాడ్లు ఉన్నాయి. ఒకడి చేతిలో కత్తికూడా ఉంది. వాళ్ళందరూ టాక్సీ డ్రయివర్లని అనవాలు కట్టాడు సింహాచలం.

''దొంగనాకొడకల్లారా! టాక్సీల్ని కాల్చేస్తుంటే చూస్తూ ఊరుకున్నార్రా?... అవున్రా అవున్రా.. మీ సొమ్ము అవుతేకదా! ఊరి బాబుగాడి సొమ్ముపోతే మీకేం! డబ్బుకు డబ్బెట్టి కొన్న బళ్ళు అద్దికి తిప్పేవోళ్ళు మీకెందుకుంటాదిరా బాధ?... పూటకి ఠికాణాలేని రిక్షా నా కొడుకులు కాల్చేస్తుంటే చూస్తూ ఎలా ఊరుకున్నార్రా?... నా కొడుకుల్ని ఒకరిద్దరిని తలతప్పించేయాల్సింది. తరవాత చూసుకుందుం, మిగతా సంగతి!''

''మీకోసం గారేజీకి ఫోన్‌చేశాం, సార్! మీరెక్కడకో వెళ్ళారంటే అప్పన్నని కూడా పంపించాం. సడన్‌గా రిక్షా నా కొడుకులు ఎటాకిచ్చేసారండి. ఆళ్ల మెజారిటీ యెక్కువైపోనాదండి. అప్పటికీ ఒక ఐదారుగుర్ని తడపడా తగిలించామండి.''

తన ఎదురుగుండా తన కొడుకుల్ని తగలెట్టేస్తున్నట్ట నిపించింది, టాక్సీలు కాలి పోతుంటే. గళ్ళ చొక్కావ్యక్తికి రక్తం సలసల కాగింది.

''ఎవడొస్తాడో ఇప్పుడు రమ్మన్రా.. రక్తం పారాలి, పదండిరా!'' అంటూ మదించిన అడవి దున్నలా బుసలు కొడుతూ జనంలోకి పరుగెత్తాడు గళ్ళచొక్కా వ్యక్తి. అతని వెంటే టాక్సీ డ్రయి

వర్లు ఎవరి చేతిలో ఉన్న ఆయుధాల్ని వాళ్ళు సవరించుకొంటూ పరుగెత్తారు.

అదే సమయంలో ఎక్కడ్నుంచి వచ్చారో చీమల పుట్టలాగ వందమందికి పైగా జనం ప్రక్క సందులో నుంచి పరుగెత్తుకొచ్చారు. వాళ్ళు సైకిల్ చెయిన్లు, పంపులు, విరిగిపోయిన రిషా భాగాలు పట్టుకొనున్నారు. వాళ్ళ మధ్యలో ఒక నల్లటి ఆసామీ ఉన్నాడు. ఎండలో అతని మెడలో పులిగోరు పతకం స్పష్టంగా కనిపిస్తోంది. అతను కోపంతో శివమెత్తినట్లు కేకలేస్తున్నాడు. ''ఈ టాక్సీ వోళ్ళు కూలిజనం కడుపు కొడ్తున్నారు. ఆళ్ళ బేరాలు పడగొడ్తున్నారు. టాక్సీలు వచ్చి రిషాలోళ్ళు ఆకలితో అలమటించిపోతున్నారు. మీది మిక్కిలి వాళ్ళ మీద దౌర్జన్యం చేస్తున్నారు. దీన్ని రిషాలోళ్ళు ఊరుకోరు. రిషా సోదరులారా! ఏకం కండి. అటో ఇటో తేల్చుకుందాం. చావైనా చద్దాం''. అని చిన్న రాజకీయ వేత్తలా కూడా లెక్చరిస్తూ పిడికిలి బిగించి గాలిలో తాటిస్తూ రిషా వాళ్ళని వెంటేసు కొని'' పదండి.. పదండి.. అటో ఇటో తేలిపోవాలి'' అంటూ టాక్సీ వాళ్ళ గ్రూపు మీదికి రిషా వాళ్ళని ఉసిగొల్పుతూ, రెచ్చగొట్టి తీసుకువెళ్ళాడు. ఆ పులిగోరు పతకం ఆసామి ఉద్రేకంతో పిడికిలి బిగించి చేతులు తిప్పుతున్నప్పుడు అతని చేతి వేళ్ళకి ఉన్న పొడుల ఉంగరాలు తళుక్కు తళుక్కున మెరుస్తున్నాయి.

రెండు పక్షాలు ఢీకొన్నాయి.

సోడాబుడ్లు పేలుతున్నాయి.

బూతులు తిట్టుకుంటున్నారు.

తలలు పగుల్తున్నాయి – నెత్తురు చిమ్ముతోంది.

రోడ్డు ప్రక్కన దుకాణాల్ని తొక్కుకుంటూ జనం పరుగెత్తుతున్నారు.

స్టేషను దగ్గర రిషావాడికి, టాక్సీవాడికి అయిన ఘర్షణ చిలికి చిలికి గాలి వానయింది.

జనం తొక్కిసలాటలో సింహాచలానికి దారేతెన్నూ తోచటం లేదు. రిషా మీద జనం పడి పోతున్నారు. సింహాచలాన్ని రిషాకేసి నొక్కేస్తున్నారు. ''ఓరయ్యోయ్, రిషాని ఇరిసేస్తారు కావాల!'' అని అనుకుంటూ, అలానే తొక్కిసలాటలో పడుతూ లేస్తూ ; ఎక్కడ జాగాదొరికితే ఆసందులోకి రిషాని తిప్పేస్తున్నాడు. దూరంగా జనం గోల సముద్రపు హోరులా ఇంకా విని పిస్తూనే ఉంది. వాటికి దూరంగా ఇరుకిరుకు సందుల్లోంచి రిషాని తొక్కుకుంటూ దూరం దూరంగా పోతున్నాడు.

''ధన్! ధన్! ధన్!'' మార్కెట్టు వైపునుంచి పిడుగులు పడ్డట్టు శబ్దం.

చెట్లమీద ఇళ్ళ కప్పుల మీద కాకులు కావు కావు మని అరుచుకుంటూ ఒక్కసారి లేచిపోయి అస్తవ్యస్తంగా పారిపోతున్నాయి.

''పోలీసు ఫైరింగ్!''

సందుల్లో కూడా మనుషులు హడలిపోయి ఇళ్ళలోకి పరుగెత్తుతున్నారు. రోడ్డు మీద ఆడు కొంటున్న పిల్లల్ని తల్లులు బరబరా ఈడ్చుకుంటూ ఇళ్ళల్లోకి లాక్కెళ్ళి తలుపులు వేసేస్తున్నారు. అంతవరకు వినిపిస్తున్న గోల ఒక్కసారి స్విచ్ వేసినట్లు ఆగిపోయింది. మనుషులు నిశ్శబ్దంగా కిక్కురుమనకుండా బెదురు చూపులుచూసుకుంటూ పారిపోతున్నారు. గాలివాన తరవాత ఆవ రించు కున్న లాంటి నిశ్శబ్దం ఆవరించుకొనుంది. నడుస్తున్న వాళ్ళు మెల్లమెల్లగా గుసగులాడు

కుంటున్నారు. ''ఒక రిక్షావోడు చచ్చిపోయాడు'' ''కాదు'' ''టాక్సీవోడంటండీ'' -- ''మంచోరే, ఐదారుగురు పడిపోయారంటుంటేనూ!''

''పాపం, రోడ్డు మీద నడుస్తున్న ఒక ఆడదానికి కూడా గుండు తగిలీసిందంటండి. నెత్తురు మండలంలో అక్కడికక్కడే చచ్చిపోయిందట!''

ఇది విన్న సింహాచలం మరీ బెంబేలెత్తి పోతూ రిక్షాని చుట్టూ తిప్పి తొక్కుకుంటూ ఊరికి దూరంగా బీచిరోడ్డుకి దింపేశాడు రిక్షాని.

అప్పటికప్పుడే నాలుగు గంటలు దాటిపోయింది. ఇంకా ఎండగా ఉండటంవల్ల సముద్రతీరం నిర్మానుష్యంగా ఉంది. బీచి రోడ్డుమీద మాత్రం దూరం దూరంగా రెండు వేరుశనగ దుకాణాలు అప్పటికే వచ్చేశాయి.

అక్కడి బస్సుస్టాప్‌లో ఓ అమ్మాయి నిల్చోనుంది. చిన్న కూనిరాగం తీస్తూ హైహీల్సుజోడు టాప్ చేస్తూ సముద్రం పొంగులకేసి చూస్తోంది. ఆ అమ్మాయి బొద్దుగా, ఎర్రగా కిర్రుగా ఉంది. గాలికి ఒంటికి బిగుసుకుపోతున్న లేత గులాబీరంగు చీరలోనుంచి పిటపిటలాడుతున్న అవయవాల బింకం తీర్చి దిద్దినట్లు కనిపిస్తోంది. ఆ అమ్మాయి నోటితో కూడా గాలి పీలుస్తు న్నట్లు ఎప్పుడూ సగం తెరచిన పెదాల్లోంచి పలువరస ఆకర్షణీయంగా కనిపిస్తోంది.

ఆదరాబాదరాగా రిక్షా తొక్కుకొస్తున్న సింహాచలం అమ్మాయిని చూసి ''రిక్షా రమ్మంటా రేటమ్మా?'' అని అడిగాడు ఆశగా. అమ్మాయి ఒద్దన్నట్లు తలతిప్పింది. తరవాత ఎక్కడకి వెళ్ళాలో తెలీక రిక్షాని నిలబెట్టి స్టాపు క్రింద చతికిలబడ్డాడు. ఆయాసం తీర్చుకుంటూ. జేబులో రూపాయి ఉండటంవల్ల గావాల్ను, ప్రొద్దుటంత నీరసం అనిపించడంలేదు సింహాచలానికి.

కాస్సేపటికి బీచిరోడ్డుమీదకి నలువైపులా చూసుకుంటూ ఓ అబ్బాయి దిగాడు. సన్నగా పొడవుగా, షోగ్గా ఉన్నాడు. బస్సుస్టాపు దగ్గర అమ్మాయిని చూసి చిరు చిరు నవ్వులు నవ్వుకుంటూ దగ్గరకు వచ్చాడు. ఆ అబ్బాయిని చూడగానే అమ్మాయి ముఖం చాటంతయింది- కొంటెచూపులు చూస్తూ.

''అయామ్ సారీ''. అని అనగలిగాడు ఆ అమ్మాయి చూపులకు, సగం తెరిచిన పెదాల్లోనుంచి కనిపిస్తున్న పలువరసకూ ఐస్ అయిపోతూ. ''ఎంత తొందరగా బయల్దేర్దామనుకున్నా వీలు చిక్కింది కాదు, ఐయామ్ సారీ! ..ఈరోజు ఒక గొడవలో చిక్కడిపోయాను. మా టాక్సీల్ని రిక్షా వాళ్ళు కాల్చేశారు. ఆ తొందర్లో మానాన్న వెంట తిరుగుతున్నాను''.. అంటూ ఇంకా ఏదో చెప్పబోతూ ప్రక్కనే ఉన్న రిక్షాని కేకేసాడు.

''ఇదిగో, ఇలా బీచిరోడ్డు వెంబడే ఆ కనిపిస్తున్న సరుగుడు తోట దగ్గరకు పోనియ్.. ఊఁ ఊఁ.. కూర్చో... కూర్చో!''... అని అమ్మాయిని కూడా హెచ్చరించాడు.

''అక్కడికా? .. అక్కడికెందుకూ?'' అంది అమ్మాయి ముద్దుగా నసుగుతూ.

''ఎందుకా?''... తరవాత ఏమిటి చెప్పాడోగాని ఆ అమ్మాయి సిగ్గుతో కిసుకిసు నవ్వుకుంటూ రిక్షాఎక్కి కూర్చుంది. ప్రక్కనే అంటుకుపోతూ కూర్చున్నాడు అబ్బాయి.

సింహాచలం రిక్షా తొక్కుతున్నాడు.

''అర గంటనుంచీ నీకోసం చూస్తున్నాను తెలుసా?''

''ఏమిటి చెయ్యమంటావ్, ఈ గొడవలో నా స్కూటరు తీసుకొని మా నాన్న తిరుగుతున్నాడు. పోనీ బస్సులో వద్దామంటే బస్సులూ , రిక్షాలూ స్ట్రయికు.''

''అయితే మార్కెట్టు దగ్గర పోలీస్ ఫైరింగ్ మీ టాక్సీల గొడవేనన్నమాట''! అంది అమ్మాయి సానుభూతిగా.

ఇంతలో వాళ్ళ సంభాషణకి అమాంతంగా అడ్డుతగుల్తూ'' మీరు స్టూడెంటు కుర్రోళ్ళేటి, బాబూ? అని ప్రశ్నించాడు సింహాచలం.

''ఊఁ'' ! అన్నాడు అబ్బాయి.

అమ్మాయి ఫక్కున నవ్వటం కూడా వినిపించింది సింహాచలానికి

''ఆహా, ఏమిలేదు ; ఊరికనే అడుగుతున్నాను. నానూ అదే అనుకున్నాను లెండి. నా పెద్ద కొడుకే ఉంటే నీ అంత ఉండుడు బాబూ. ఆడూ నీకన్నా జెబ్బరయిన మనిషి అయిుండుడు.. నీకెరికా? ఒక సుట్టు సాన్నాళ్ళకిందట మనూరి మీద జపానోడు బాంబులేసినాడు – అదే – ఆటైము లోనే అడుపుట్టాడు. అప్పుడే కొత్తగా ఈ ఊరికి సైకిలు రిషాలొచ్చినాయి. ఒవ్వా! ఎక్కడ సూసినా మిలట్రోళ్ళూ, దొరలే! ఆళ్ళని ఎక్కించుకొని రేత్రింపగళ్ళూ గాడీ తొక్కేవోణ్ణి. చేతిలో బాగా డబ్బాడేది. సవకరోజులు. నా కొడుకుని దేవేందురిడినాగ పెంచేవోళ్లిమి. ఆడు అడిగినవన్నీ కొని తెచ్చీసేవోణ్ణి. పువ్వుల పువ్వుల కమీజు లేసుకుండీవోడు. గుంటముండా పాపడు ఎంత తెలివైనోడో తెల్సా? ఆమడ దూరాన్న నా రిషా సప్పుడిని బండి చెక్కరాల్లాంటి కళ్ళు టివ టివ కొట్టుకుంటూ ఒవ్వా! హెచ్చినీ అయిపోతూ కేకలేసుకొంటూ రిషాకి అడ్డుపడి నా కాళ్ళట్టుకుని ఎగబాకిపోయి సీటెక్కి కూకునేవోడు . ఓశ్! దొరలగుంటడిలా సఫేదుగా ఉండేవోడు. మాగాచారం కరమం – ఆరోఏట ఇలా అడుగెట్టాడు. ఒకే రోజు, ఒక్కరోజే బాబూ, అదేం మాయదారి జొరమొచ్చిందో, ఒక దగ్గుగాని, ఇరోసినంగాని, ఒక నొప్పిగాని నేదు. గుటుక్కుమని పోనాడు. ఇల్లు సీకటి జేసేసి నాడు'' అంటూ పెద్దగా నిట్టూర్చాడు.

''మరి నీకు పిల్లలేరా?'' అని అడిగింది అమ్మాయి.

''ఆడి తరవాత ఒక ఆడపిల్ల పుట్టిందమ్మా. అది పురిట్లోనే పోనాది. ఆ పురిటి టైమప్పుడే మా ఇంటిదానికి గొప్ప జబ్బుచేసేసింది. సచ్చి పోద్దనుకున్నారు. ఆ జబ్బు అప్పట్నించి ఇప్పటి దాకా జరం అనో, గుండెనొప్పనో, దగ్గనో సంపేస్తుంది''.

''అయితే, నీకింకెవ్వరూ లేరటోయ్?'' అబ్బాయి అడిగాడు జాలిగా.

''అయ్యో, తండ్రీ! ఉంటే నాకెందుకీ గాచారం? ఈ వొయిస్సులో రిషానాక్కోడం!''

''పాపం! పోనీ, నీ కష్టం కిట్టుబాటౌతోందా, రిషాల్లో?''

''అదే కిట్టుబాటు బాబు. ఒక రోజు తింటే మరసటి రోజు పస్తులు పడ్తాం. ఈ ఏలకి మూడు రోజులయింది. రోజుకి అర్ధరూపాయి కూడా దొరకడం నేదు. బాబూ! ఒయస్సు ముదిరిపోయి. బలం పడిపోయిన తరవాత రిషావోడి బతుకు కుక్కలు కూడా పడవు... నేను మొదట్లో ఓడలికి బస్తాలు మోసీ ఓణ్ణి. కష్టానికి తగ్గ డబ్బులు దొరికేయికావు. ఈ ఊరికి యుద్ధం టైంలో కొత్తగా సైకిలు రిషాలు దిగాయి. నా తోటోళ్ళు సానామంది ఈ పని ఒగ్గేసి రిషాలు నాగడానికి ఎలిపో యారు . అప్పటిలో బేరాలు సానా బాగుండేవి. ఎక్కడ పడినా ఈ కష్టమే కదా, మన రాత బాగుంటే

నాలుగు డబ్బులు ఎక్కువ దొరుకుతాయి; కూలోడి నాగ బస్తాలు మోసే బదులు సొతొంత్రంగా కష్టబడి బతకొచ్చును కదా అని; దీంట్లోకి దిగాను. కొత్తలో బాగుండేది బాబు. రాను రాను రోజులు మారిపోనాయి. కాలం మారిపోనాది. ఎక్కడ సూసినా సీమల పుట్టల్లాగ రిషాలయితే ఇంకేం బేరాలుంటాయి? దీనికి తోడు రోజరోజుకీ ఒయస్సు పైబడుతుంది. మునపటిలాగా ఓపిక నేదు. కష్టపడదామన్నా కష్టపడలేని జలవుం అయిపోయింది నాది.'' అంటూ ఎగుడిలో ఎదురుగాలిలో తొక్కలేక దిగి దెబ్బతగిలిన కాలు ఒక్కసారి ఝాడించి తిరిగి రిషా లాగడం మొదలు పెట్టాడు.

''మొన్ననెవడో పిదపకాలం గుంటడు ఆడుకుంటూ బొంగరంతో నా కాలికి బొక్కెట్టేసినాడు. దెబ్బ జివ్వు జివ్వుమని నాగేస్తోంది... అబ్బా''! అంటూ కొద్దిగా కుంటుకుంటూ రిషా లాగుతున్నాడు. నీ రెండ ముఖానికి సూదుల్లాగ తగులుతుంటే ఉస్సు ఉస్సు అనుకుంటున్నాడు.

''ఏంటోయ్, లాగలేకపోతున్నావు. దిగమన్నావేంటి ?'' అన్నాడు అబ్బాయి.

''అమ్మ! పరవాలేదు; మీరలాగే కూకోండి, బాబు.'' అని దిగుతున్న వాడిని వారించి తిరిగి మొదలు పెట్టాడు.'' సూడు బాబూ. అసలు ఈ జీవుణ్ణి సుక పెట్టీకూడదు. ఎప్పుడూ కష్టంలోనే ఉంచాల. మొగజల్మం ఎత్తాక సచ్చిందాకా కష్టపడాలి. ఒకసారి సుకం మరిగిపోతే ఈ జీవుడు కష్టానికి ఓర్చనేడు . ఓర్చలేక మాయజేసి సుకపడదామనుకుంటాడు. అప్పుడే మాయలు నేరుస్తాడు. మోసాలు చేస్తాడు''. అని ఇంకా ఏవేవో చెప్పుకెళ్తున్నాడు.

ఈ వింత వేదాంతానికి అమ్మాయి, అబ్బాయి బోరెత్తిపోతూ ''నేరకపోయి కదిపాం, ఇహ మనల్ని వదల్డు గావాల్ను. వీడిక కష్టాలన్నీ ఏకరవు పెడ్తూ కూర్చుంటాడు కాబోలు''! అని ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ ముఖాలు చిట్లించుకుంటున్నారు.

ఇంతలో సరుగుడు తోట వచ్చేసింది. రిషాఆపి ఇద్దరూ దిగిపోయారు.

''ఇదిగో మేం చల్లగాలికి అలాకూర్చుని వస్తాం. నువ్వు అక్కడ కూర్చో. తిరిగి నీ రిషాలోనే వచ్చేస్తాం'' అని అమ్మాయి చెయ్యిపట్టుకొని తోటలోకి పరుగెత్తుతున్నవాడల్లా ఆగి వెనక్కి తిరిగి వచ్చి ''ఇదిగో చిన్న మాట.. ఆ దిబ్బ పక్కనే కూర్చో. ఎవరన్నా వస్తుంటే చూడు. ఎవ్వరైనా మా వైపు వస్తుంటే కొంచెం గట్టిగా దగ్గు... ఎక్కువ డబ్బులిస్తాం ఏ ఫరవాలేదు.'' అని వెళిపోయాడు. ముందు సింహాచలం ''ఛ! కాపుండటమా? ఇదేంపని? అని అనుకున్నాడు గాని, ఎక్కువ డబ్బు లనగానే మెత్తబడిపోయి ఊరుకున్నాడు.

ఎండ తగ్గిపోతోంది. కెరటాలు ఒడ్డున విరుగుతూ నురుగులు కక్కుతున్నాయి. సముద్రపు గాలికి సరుగుడు చెట్లు రొదచేస్తున్నాయి.

సరుగుడు తోటలో ఒక దుబ్బు పక్కన కూర్చొని ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నారు అబ్బాయి, అమ్మాయి. నీటిని తాకుతూ బారులు బారులుగా ఎగిరే సముద్రపు కాకుల్ని, తీరాన్ని అరుస్తున్న తీతువు పిట్టల జంటల్ని వాళ్ళు తనివితీరా చూస్తున్నారు. నీ రెండలో సముద్రపు నీరు ఎరుపు పసుపు మిళితమైన వసంతంలా మెరుస్తోంది. ఆ ఏకాంతస్థలిలో ఒకరికొకరు రాధామాధవుల్లా కనిపిస్తున్నారు. ఆ నిర్జన సముద్ర సైకతస్థలి మనోజ్ఞ యమునా తీరంలా ఉంది.

వాళ్ళకి దూరంగా ఒక ఇసక దిబ్బమీద ముడుచుకు కూర్చున్నాడు సింహాచలం. ధూళితోనూ

చెమటతోనూ నిండిన ముడతలు తేరిన ముఖం పచ్చటి నీరెండలో పాతబడిన రాగిరంగులో మెరుస్తోంది. సముద్రంలో ఎగురెగురుతూ నడుస్తున్న బెస్త పడవల్ని సాలోచనగా చూస్తున్నాడు.

''ఆలకి కూడా నాలాగే రెక్కాడకపోతే డొక్కాడదు కదా!'' అనుకున్నాడు. ''ఆళ్ళు నీళ్లల్లో పడి సచ్చిపోతేనో''! అని కూడా అనుకున్నాడు. కొండరాళ్ళకి ఢీకొడ్తున్న కెరటాలు బలవంతుడితో కలబడి వీగిపోయి వెనకకు మళ్ళిపోతున్న అర్భకుడి కన్నీటి కెరటాల్లా ఉన్నాయి. కనుచూపు మేరవరకూ పరచుకున్న ఇసక దిబ్బలతో సముద్రతీరం తన జీవితంలాగే ఎడారిలా కనిపిస్తోంది. సముద్రపు ఘోష అన్నార్తుల ఆకలి ఘోషలా వినిపిస్తోంది.

ఇంతలో పొద ప్రక్కగా వచ్చిన కిలకిలనవ్వులతో తన కష్టాల్ని ఆలోచిస్తున్న సింహాచలానికి కుదిపిలే పినట్లయింది. సింహాచలం చూసేసరికి అమ్మాయి పొదప్రక్కన ఇసకలో పొర్లిపొర్లి నవ్వు తోంది. తొలగిన చీరలో నుంచి పిక్కలు మంచుతో చేసినట్లు నవనవలాడుతున్నాయి. పాదాలమీది నుంచి అస్తవ్యస్తంగా లేచిన పట్టీలతో బిగుసుకుపోతున్న పిరికి కండలు పిటపిటలాడుతున్నాయి. అబ్బాయిని తన అందమైన మెత్తని పాదాల్తో తంతోంటే పట్టీల చిరుమువ్వలు గల్లు గల్లు మంటు న్నాయి. ఉన్నట్టుండి అబ్బాయి అమాంతంగా మన్మథావస్థతో రెచ్చిపోయి అమ్మాయి కాలు పట్టుకొని బరబర మీదికి లాక్కున్నాడు. అమ్మాయి ఆనందంతో పరవశించిపోతూ కెవ్వున చిన్న కేక పెట్టింది. అప్పుడు పొదలచాటు నుంచి సింహాచలానికి అమ్మాయి నున్నటి తొడలు కూడా కనిపించాయి.

సింహాచలం తనివి తీరా చూస్తున్నాడు. అప్పుడు సింహాచలానికి సముద్రపు గాలి కితకితలు పెడుతున్నట్లయింది.

అబ్బాయీ, అమ్మాయీ ఒకళ్ళమీద ఒకళ్ళు పడుత్తాలేస్తున్నారు. కిసుకునవ్వులు . గాజులు చిట్లుతున్న చప్పుడు . మూలుగులు.

అలా వాళ్ళిద్దరినీ చూస్తుంటే సింహాచలానికి ముచ్చటనిపించింది. ఉండుండి సిగ్గుతో ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నాడు. అప్పుడు సింహాచలానికి ముసిల్ది జ్ఞాపకం వచ్చింది. ''లచ్చుమ్మకి కూడా ఈ ఆడదానినాగే తొడలు నున్నగా బలంగా ఉండేవి'' అనుకున్నాడు. పెళ్ళ యిన కొత్తరోజులూ, ఆ అనుభూతులూ తెరలు తెరలుగా జ్ఞాపకం వస్తున్నాయి. పెళ్ళయిన కొత్త రోజుల్లో లచ్చుమ్మతో సింహాచలం రకరకాలుగా సర్దాలు తీర్చు కుందా మనుకునేవోడు. కూలి పనికి నాగా పెట్టేసి పెళ్ళాన్ని సింహాచలం కొండకి తీసికెళ్ళి సంపెంగ తోటల్లో తిరుగుదామనుకునే వోడు. గాని ఆళ్ళ బాబు ''లంజికొడకా కూలి పనికెళ్ళక; పెళ్ళాంతో సరసాలాడుకు కూర్చుంటే రోజెలా గడుస్తాదిరా?'' అని తిట్టేవోడు. కొత్తలో కొత్త అవటం వల్లనయితేనేం, సిగ్గుతోనయితే నేం లచ్చుమ్మ సింహాచలాన్ని గొప్ప ట్రబుల్సులో పెట్టేసేది. అసలే ఒకగది తాటాకుల కొంప . దాంట్లోనే సింహాచలం తల్లి, తండ్రి, పెళ్ళాం. సందుచూసుకొని లచ్చుమ్మతో సరసాలాడబోతే'' మామ సూస్తాడు. అద్గో! అదే ఒద్దంటాను'' అనేది. ''కొంచెం మోటుతనం చెయ్యబోతే ఎర్రిబేపి నాగ కొరికేసేది నంజి కూతురు''. అని మనస్సులో అనుకున్నాడు. ఒకసారి ఇంట్లో ఎవరూలేరు. లచ్చుమ్మ బొమ్మలా తయారయి కొప్పునిండా పువ్వులెట్టుకొని నీళ్ళు తెస్తుంటే సింహాచలం ఉండ బట్టలేకపోయాడు. నీళ్ళు తొణికి తడిసిపోయిన చీరలోంచి లచ్చుమ్మ ఒళ్ళు అర్ధనగ్నంగా కని పిస్తోంటే తలుపు చాటున

దాగొని దగ్గరకు రాగానే గబుక్కున పట్టుకున్నాడు. లచ్చమ్మ బెంబేలెత్తి పోయి కడవ ఎత్తేసి సింహాచలాన్ని అమాంతంగా తోసేసింది. సింహాచలం బేలెన్సు తప్పిపోయి వెల్లకిత లా గుమ్మం మీద అమాంతంగా దభీమని పడిపోయాడు. ఇంతలో బైట చుట్ట కాల్చుకుంటున్న ముసలాడు ఈ శబ్దం విని పరుగెత్తుకొస్తుంటే చూసి సింహాచలం ఆదరాబాదరాగా తడుముకుంటూ లేచి కమ్మ చూరిని గుద్దుకుంటూ, తూలిపోతూ; ఒక్క ఊపుని పరుగెత్తుకు పారిపోతుంటే లచ్చమ్మ విరగబడి నవ్విన నవ్వులు ఇప్పుడు ముసలివాడి మనస్సులో ప్రతి ధ్వనిస్తున్నాయి.... రోజులు దొర్లిపోయాయి.. తల్లీ.. తండ్రీ.. చచ్చిపోయారు. తనూ లచ్చమ్మా మిగిలిపోయారు.. సంసారం.. పిల్లల్ని కనటం... వాళ్ళ చావులు... చాలీచాలని డబ్బులు.. అకలి... జబ్బులు, ఇవన్నీ జ్ఞాపకం వచ్చేసరికి బాధతో భారంగా కళ్ళుమూసుకు కూర్చున్నాడు.

అలా ఎంతసేపు కూర్చున్నాడో తెలియని సింహాచలం అబ్బాయి పిలుపుతో ఈ లోకంలో పడ్డాడు. అస్తమిస్తున్న సూర్యుని అరుణారుణ కాంతిలో ప్రతిఫలిస్తూ సముద్రం రక్తంలా ఉంది. అప్పటికప్పుడే అమ్మాయి రిషాలో సిగ్గుతో కూర్చోనుంది. అబ్బాయి కూడా ఎక్కిన తర్వాత సింహాచలం రిషా తొక్కడం మొదలు పెట్టాడు.

''ఆడు బతికుంటే ఈపాటికి పెళ్ళిచేసుకొనిపెళ్ళాంతో నీలాగే సరసాలాడేవొయస్సు ఉండేది.'' అన్నాడు తొక్కుతూ.

పెళ్ళాం అనగానే అబ్బాయి అమ్మాయి ఒకర్నొకరు చూసుకొని మనస్సులోనే నవ్వుకున్నారు.

''ఏటో పిచ్చిగాని, సచ్చిపోనాడని అనుకోడంగాని ; ఆడు బ్రతికే ఉంటే సరదాలు తీర్చుకోటానికి ఎక్కడ తీరికుండేది? ఆడు కూడా నాలాగే కూలికి రిషానాగుతుండేవోడు.'' అంటూ ఇంకేవేవో చెప్పాడు; తన మనస్సుతేలిక పడుతుందని. కాని అబ్బాయి అమ్మాయి వాటికి ఏమాత్రమూ రియాక్టు కాకపోవటం గమనించి తన బాధను తనే మింగుకుంటూ రిషా తొక్కుతున్నాడు.

బస్సుస్టాప్‌రాగానే సింహాచలం చేతిలో పదిరూపాయల కాగితం పెట్టి వాళ్ళు వెళ్ళిపోయారు. సింహాచలం ఆడబ్బుని చూసి తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు. వాళ్ళిద్దర్నీ ధరమాత్ములు అని మనస్సులో అభినందించాడు. ఆ రోజు అంతటి అదృష్టాన్నికలిగించిన ఇంటెదుటి మరిడమ్మ దేవతకు కోటి దణ్ణాలు పెట్టుకొని, జేబులో రూపాయి నోటు తీసి ఈ పదిరూపాయల నోటుతో కలిపి మూడుసార్లు లెక్కపెట్టుకొని కళ్ళకద్దుకుంటూ మొల్లో దోపుకున్నాడు ''ఇయ్యేల్టికి ఇంటికి పోదాం''. అనుకుంటూ రిషా ఎక్కాడు. రిషా రెట్టింపు హుషారుగా తొక్కుతున్నాడు. చల్లగాలికి శరీరం మీద చెమట ఆరుతూ హాయిగా ఉంది. రెండు రోజులనుంచి ఒంటి పూట తిండికూడాలేదు. మూడు రోజులకు సరిపడ్డ బియ్యం కొనుక్కుందామనుకున్నాడు. అప్పుడు సింహాచలానికి రకరకాల రుచులమీద కూడా మనస్సుపోతోంది. మాంచి జెల్లచేప కొని ముసిల్దానితో చింతకాయ పులుసు పెట్టించుకుంటే భేషుగ్గా ఉంటుందనుకున్నాడు. నెత్తళ్ళ ఇగురు కూడా పసందుగా ఉంటుందనుకున్నాడు. ''కాలి దెబ్బ నాగేస్తంది.'' మధ్య దారిలో కొంచెం సారా తాగుతే ఒంటికి సుఖంగా ఉంటుందనుకున్నాడు. ''ముసిల్దానికి తెలిస్తే? అమ్మో, లంజికూతురు కస్సుమని లేస్తాది. ఉశ్శే! సేపల కూర తిని పల్లకొని తొంగుంటే దానికి తెలుస్తదేంటిలెద్దూ!'' అని సరిపెట్టుకున్నాడు.

అప్పటికప్పుడే రోడ్డు దీపాలు వెలిగాయి. ఆకాశంమీద అక్కడా అక్కడా చుక్కలు తొంగి చూస్తున్నాయి. తొందరగా దారిలో చుక్కేసుకొని బజారులో చేపలు కొనుక్కోని ఇంటికి పోదామని మరింత స్పీడుగా తొక్కుకుంటూపోతున్నాడు. ఆ తొందర్లో వెనకనుంచి మనుషులు తనని పిలుస్తూ పరుగెత్తుకొస్తున్న చప్పుడు గమనించలేదు. ''తొత్తుకొడుకు, ఎలాపారిపోతున్నాడో!'' అని వెనకనుంచి పరుగెత్తుకొస్తున్న వాళ్ళు తిట్టుకుంటూ, మందకుక్కల్లా నలువైపులా గిరేసి, రిక్షాని పట్టుకొన్నారు. సింహాచలాన్ని ఒకడు రిక్షామీద నుంచి లాగేశాడు. సింహాచలానికి ఇదంతా అర్థంకాక వాళ్ళవైపు అయోమయంగా చూస్తున్నాడు.

''ఏరా, ముసలోడా రిచ్చాలు ట్రయికని నీకు తెల్దేటిరా? బండెందుకు తీసినావ్?'' అని గుడ్లు ఉరుముతూ ఒకడు సింహాచలం జుబ్బా అందుకున్నాడు.

''ఎందుకు తెల్దు! తొత్తుకొడుక్కి డబ్బార్జించి మొల్లో దోపేసుకొందామని. ఈడిలాటి నాకొడుకులు ఉండబట్టే మన రిక్షావోళ్ళ గతులీలాగున్నాయ్. అవుర్రా! మనలాంటి జీవులే ఇద్దరు అక్కడికక్కడే ఫైరింగ్‌లో సచ్చిపోనారు కదా; ఒక తండ్రికి పుట్టిన కొడుకువైతే రిక్షా తీస్తావురా?. నీలాటి నాకొడుకులిని నరికి కొప్పెట్టెయ్యాల్రా!'' అని మరి కోపం పట్టలేక సింహాచలాన్ని మెడపట్టి ఈడ్చి ఒక్క తోపు తోసేడు మరొకడు.

సింహాచలం తూలిపోతూ తమాయించుకొని ''తోస్తావేట్రా... ట్రయికో గ్రియికో నాకేం తెలుసును? మీరూ మీరూ ఒళ్ళుకావరమెక్కి కుమ్ములాడుకుంటే నాకేం కావాల? రిక్షానాక్కపోతే నీ బాబెడ్తాడేటి కూడు? రెండు రోజుల్నించి పస్తులు పడి సచ్చిపోతున్నాం. మీ అమ్మమొగుడి సొమ్మెట్టి నన్నాదుకున్నార్రా?... లంజకొడకల్లారా, మీరంతా కుమ్మక్కయి నన్ను తన్నడాని కొచ్చార్రా?'' అని రోషంతో రెచ్చిపోతూ తిట్లు లంకించుకున్నాడు. ఇంతలో రిక్షావాళ్ళలో వెనకనున్న ఒకడు మెల్లిగా తక్కిన వాళ్ళలోనుంచి తోసుకుంటూ సింహాచలం వైపు అనుమానంగా దగ్గరకొచ్చి ముఖంమీద ముఖం పెట్టి తేరిపారి చూసి ''ఆగు, ఆగు!.. నువ్వుకాదూ! ఒరేయ్, గళ్ళ చొక్కా టాక్సీ ప్రొప్రయిటర్ని రిక్షామీద తీసికొచ్చినోడివి నువ్వుకాదూ? ఈడే.. ఈడేయీడే.. ఈ నాకొడుకే!'' అన్నాడు ఆశ్చర్యంగా గుడ్లు పెద్దవి చేస్తూ.

''అమ్మ ముసిల్లంజికొడకా, ఎంతకి తెగించీనావురా!.. తొత్తుకొడకా, మళ్ళీ ఏమీ తెలియ నట్టు మాటాడుతున్నావు.... తగల్నియ్యండ్రా!''.. అంటూ కసిగా అందరూ సింహాచలం మీదపడి పోయారు. చేతికొచ్చిన దెబ్బ అక్కడా ఇక్కడా అని చూడకుండా కొట్టారు. క్రింద పడిపోతే కసా బిసా డొక్కలో తన్నారు. దాంట్లో ఒకడు కాస్త కనికరించి ''ఒగ్గియండ్రా, ఇకచాలు; ఒగ్గేయండ్రా! ముసిల్లంజికొడుకు సస్తాడు. ఈడిని కొట్టినా ఒకటే ఆ కుక్కని కొట్టినా ఒకటే. అంటూ తతిమ్మా వాళ్ళని విడిపించి తీసుకుపోయాడు. దెబ్బలతో హూనం అయిపోయిన సింహాచలం ముసలిపులిలా లేచాడు. ముసలి కోపంతో కంపించిపోతూ, ''లంజకొడకల్లారా, మీఅమ్మ!'' అని అనుకుంటూ దగ్గర్లో ఉన్న రాళ్ళు తీసి వాళ్ళ వెంటపడ్డాడు. వాళ్ళని అమాంతంగా రాళ్ళతో కొట్టి చంపేద్దామను కున్నాడు. కాని వాళ్ళందరూ ఒక ఊపుని ఆగి, వెనక్కి తిరగ్గానే ధైర్యం చాలక; రాళ్ళని కింద పడేసి నోటికొచ్చిన బూతులు అందుకున్నాడు. లంజకొడకల్లారా. నేను ముసిలోడ్నని అందరూ కలిసి కొడ్తార్రా?... మొగలంజికొడుకులైతే ఒక్కరొక్కరూ రండ్రా.. నేను ఎవడి బాబు సొమ్ము

తిన్నా(న్రా?.. నా కాయికష్టం మీద నాను బతుకుతున్నాను. ఎవడో నారిక్షా ఎక్కివొస్తే ఆడిని నేను కోరి ఎక్కించికొచ్చినా(న్రా?.. నేను ఎవడికేం అన్నేయం చేసేనని నన్ను కొట్టా(ర్రా?.. మీ అమ్మల పక్కల్లోనూ, మీ పెళ్ళాల పక్కల్లోనూ తొంగున్నా(న్రా?... లంజికొడకల్లారా! మీ అమ్మ!''.. అని అవి వాళ్ళు కనుమరుగయ్యే వరకూ తిట్టాడు. తరవాత గొణుగుతూ తిట్టుకుంటూ నోట్లోకి దూరిన ఇసకని కేం(ద్రించి ఉమ్మేతూ మొలలో నిరూపాయలు ఉన్నాయో లేవోనని అనుమానంగా తడిమి తీసి లెక్క పెట్టుకొని తిరిగి దోపేసుకున్నాడు. తలలోనూ, ముక్కులోనూ దూరిన ఇసకని దులుపుకుంటూ రిక్షామీద ఎక్కి కూర్చున్నాడు.

రిక్షాతొక్కుతున్నాడే గాని మనస్సులో బాధతో గింజుకుపోతున్నాడు. కుమ్ములాటలో కాలి మీద దెబ్బరేగిపోయి మండిపోతోంది. '' ఏటీగాచారం?... నానేటి సేసానని నన్నీళ్ళందరూ కుల్ల బొడీసీసినారు. నానేం అపరాదం సేసానవో మరిడమ్మ తల్లి నాకీ సిచ్చేసింది''! అనుకుంటూ కుమిలిపోతున్నాడు. అప్పుడు సింహాచలానికి చచ్చిపోయిన కొడుకు జ్ఞాపకం వచ్చాడు. ఆడే వుంటే నాకీ కష్టం ఎందుకు.. ఆడే ఉంటే ఈ నా కొడుకులు నన్నిలా కొడ్తుంటే ఎక్కడున్నా పా(రాకున్నా.. ఇద్దరం కలిసి ఈ నాకొడుకుల పేగుల్ని తీసెయ్యకపోయుందుమా'' అని అనుకున్నపుడు సింహాచలం గొంతులో ఏదో మాదిరిగా అనిపించింది. అ(ప్రయత్నంగా కళ్ళుతుడుచుకుంటూ రిక్షా తొక్కుతున్నాడు.

మలుపులో సారాదుకాణం కనిపించేసరికి తడారిపోయిన పెదాల్ని నాలికతో తడుపుకుంటూ శారీరకంగానూ మానసికంగానూ తగిలిన దెబ్బలనుంచి ఉపశాంతికోసం తాగుదామనుకున్నాడు గాని, సరదాకి తాగాలనిపించలేదు. తిన్నగా రిక్షాని తీసికెళ్ళి సారా కొట్టు దగ్గర నిలబెట్టి దుఖాణం లోకి దూరాడు సింహాచలం.

సారాదుకాణం చీకటి చీకటిగా ఉంది. లోపల పొగబట్టిన బల్బు మసగ కాంతితో వెలుగుతోంది. బయట బోర్డుకు పెట్టిన ఎ(రబల్బు (క్రింద రెండు బెంచీలు వేసున్నాయి. దానిమీద కొందరు తాగు తూ కబాబు పుల్లలు నవులుకొంటూ కబుర్లు చెప్పుకొంటున్నారు. పక్కనే ఒక ముసల్ది కుంపటి మీద కబాబు పుల్లలు కాల్చుతోంది. బాగా చీకటి పడనందుకు దుకాణం అంత రద్దీగా లేదు. అప్పుడప్పుడు మనుషులు వచ్చి బుకింగ్ కౌంటర్లో టికెట్లు కొన్నట్లు డబ్బులిచ్చి కిటికీలోంచి సారాగ్లాసులు అందుకుంటున్నారు. తేన్చుకుంటూ, గొణుక్కుంటూ, ఉమ్మకుంటూ మూతులు తుడుచుతుని పోతున్నారు. ఉండుండి గాలి కొట్టినప్పుడల్లా సారావాసన . నిప్పులమీద కాల్తున్న కబాబులవాసనా మత్తుగా ఘాటుగా గుప్పు గుప్పున కొడ్తున్నాయి.

సింహాచలం మొలలో డబ్బుతీసి ముందు పదిరూపాయల కాగితం మారుద్దామనుకున్నాడు. తరవాత ''రూపాయిది సాల్లే'' అనుకుంటూ పదిరూపాయల కాయితం మొల్లో పెట్టుకో బోతుండ గా వెనకనించి ''ఒరేయ్, సింహాచలం; ఇలారా!'' అనే కేక వినిపించింది. వెనక్కి తిరిగి చూసేసరికి మెడలో పులిగోరు పతకం ఆసామి బెంచీమీద కూర్చొనున్నాడు. వాడి పక్కనే మరోహడు సన్నగా డొక్కులా నక్కలా ఉన్నాడు. పులిగోరు పతకం ఆసామిని చూడగానే పాముని చూసిన కప్పలా సింహాచలం గజగజ లాడిపోయాడు . వీలుంటే పారిపోద్దామా అన్నట్లు నలువైపులా బిత్తరి చూపులు చూశాడు.

''ఎన్నాళ్లురా, ఇలా తప్పించుకు తిరుగుదామనుకుంటున్నావ్? ఏ(టా, అలాచూస్తున్నావ్; ఇలారా!'' అని గర్జించాడు. యజమాని పిలుపుకు హడలిపోతూ తోకముడుచుకున్న కుక్కలా సింహాచలం పులిగోరు పతకం ఆసామి దగ్గరకు నడిచాడు. ఇద్దరూ బయట వేప చెట్టు(క్రిందకి చీకట్లోకి నడిచారు. నక్కలాటి సన్నటివాడు కూడా బీడీకాల్చుకుంటూవాళ్ళ వెనకాల నడిచాడు.

''వారం రోజులయింది, రిషా అద్దె ఎగ్గొడ్తున్నావ్!... నీ బాబు బండి అనుకుంటున్నావే(టా?''

''బాబ్బాబూ, నీడబ్బు నేను తినీను. మూడురోజుల్నుంచి రోజుకి అర్ధరూపాయైనా దొరకటం లేదు.. ఒకపూట గెంజి కూడా కాసుకోలేకపోతున్నాం... పస్తులు పడిపోతున్నాం.... రెండు రోజుల్లో నీ డబ్బు పూరాగా ఇచ్చేస్తాను. ఇదిగో బాబూ నీకు దణ్ణం'' అంటూ చీకట్లో ఆ ఆసామీ కాళ్ళు పట్టుకోడానికి తాప(త్రయ పడుతున్నాడు.

''చఛ్! లేరా లంజికొడకా! ఈ రిషా నాకొడుకుల్తోనేను పది సంవత్సరాల నుంచీ పడ్తున్నా(రా! నాకు చెప్పకురా; ఈ కబుర్లు! తొత్తుకొడకా, తాగడానికి డబ్బులొస్తయ్యే! మొలలోనుంచి ఇప్పు డిప్పుడే పదిరూపాయలు తీశావ్. మూడురోజుల్నుంచి తిండిలేక ఛస్తున్నానంటావ్. ఎందుకురా, ఈ అబద్ధాలు? అందుకే మీ రిషానా కొడుకులికి రోజులు గడవవురా. అద్దెకి బండి కావాలని కాళ్ళా వేళ్ళా పడ్తారు. తీరా కనికరించి ఇస్తే అద్దె ఎగ్గొడ్తారు. ఏమిరా? – అని నిలదీసి అడుగుతే కడుపు – ఆకలి– పస్తులు– అంటారు. ఇదొకటి కొత్తగా నేర్చుకున్నారు. ఏదిరా? నిజంగా ఆకలితో చచ్చిపోయిన ఒక్క లంజికొడుకుని చూపించు. రూపాయి దొరికితే చాలు తాగేస్తారు. తాగినోళ్ళు తాగినట్టుంటా(రా. చుక్కపడిపోగానే గవినేరు కొడుకు లైపోతారు. తగువులూ, తన్నుకోడాలూ... అంతెందుకు! ఈ రోజు ఒళ్ళు పోతరించిపోయి ఆ టాక్సీవాళ్ళతో దెబ్బలాడారు. నా అయిదు రిషాలు గుండగుండ అయిపోయాయి. ఆ డబ్బు మీరిస్తా(రా? ఒక్కొక్కటి పదిహేను వందలకి కొన్నాను. నా కళ్ళ వెంబడి నెత్తురు చుక్కలు కార్తున్నాయి. నాకూ పెళ్ళాం పిల్లలూ ఉన్నారు. అక్కడ తగువులాడ్డం మళ్ళీ నా కాళ్ళు పట్టుకోవటం. ఈ కుక్క జిట్టీల్లో ఇరుక్కొని మీకోసం పోలీసు వాళ్ళ చుట్టూ ఆఫీసుల చుట్టూ తిరగటం... ఇది న్యాయంరా? పోనీ ముసిలోడివి, రోజూ అద్దె ఇచ్చుకోలేవు; రోజు విడిచి రోజు జమకట్టమన్నాను. వారం రోజుల్నుంచి అద్దె ఎగ్గొడ్తున్నావ్, మనిషివి అయిపు లేవు.... ఇది న్యాయంరా?'' అని రాజకీయ వేత్తలా ఒక్క దమ్మున ఆ ఆసామీ మాట్లాడుతోంటే సింహాచలం బిక్క చచ్చిపోతూ చూస్తున్నాడు. ఉ(ద్రేకంలో పులిగోరు పతకం ఆసామీ చేతులు తిప్పుతున్నప్పుడు అతని వేళ్ళకున్న పొడుల ఉంగరాల మీద దూరంగా వెలుగుతున్న ఎ(ర బల్బు కాంతి అప్పుడప్పుడు పడి రంగురంగులుగా మెరుస్తున్నాయి. ''ఏదిరా, నీదగ్గరెం తుందో; ఇయ్యి!'' అని సింహాచలం ''బాబ్బాబు'' అంటున్నా మొలలోనుంచి డబ్బు లాక్కున్నాడు.

''మిగిలాది జమకట్టి రిషాతీసికెళ్ళు.. అరేయ్, రాజిగా ఆరిషాని మనగారేజీకి తీసుకపద!'' అనిపక్కనున్న డొక్కులాంటి నక్క మనిషికి ఆర్డరు ఇచ్చాడు.

సింహాచలం వధ్యశిలకు తీసుకు వెళ్తున్న పశువులా ''బాబూ, బాబూ!'' అని అరిచాడు.

''బాబూ, నీ పిల్లలకి పుణ్యముంటుంది. మూడు రోజులయింది సరిగ్గా ఒకపూట గెంజికి కూడా కూలి డబ్బులు చిక్కడం లేదు. సత్తెపెమాణంగా చెబుతున్నాను. నిజంగా ఆ మరిడమ్మతల్లి సాచ్చిగా చెప్తున్నాను. ప్రతీ ఏడు ఆయమ్మకి జాతరలు చేయిస్తావు. ఆయమ్మ సత్తెం నీకు తెల్దా.

నేను అబద్ధమాడానా, మూడు రోజులు తిరక్కండా నానూ నా పెళ్ళామూ బుగ్గయిపోతాం. ఈ రోజే ఈ డబ్బు దొరికింది. నీ కాళ్ళు పట్టుకుంటాను, ఇచ్చి బాబూ!..... రెండు రోజుల్లో నీ డబ్బు నీకిచ్చేస్తాను... బాబూ! పోనీ బాబూ పది రూపాయలు ఉంచుకొని మిగితా రూపాయి ఇచ్చేయ్ బాబూ.. ఈ రోజు గెంజికి ఉండదు.. ఇది నీకు దరమం కాదు. ముసిలోడ్ని'' అని నడుస్తున్న ఆసామీ వెంటపడుతూ దీనంగా అడుక్కుంటున్నాడు. ఇంతలో నక్కలాంటి డొక్కుమనిషి రిషాని తీసుకుపోతుండడం గమనించి సింహాచలం మతిపోయినవాడిలా ''పోనీ బాబూ, రిషా ఒగ్గీబాబూ.. అది నేకపోతే నేను సచ్చిపోతాను. అదుంటేనేగానీ రోజు గడవదు'' అని రెండుచేతులూ పట్టుకుంటుంటే విదిలించుకొంటూ, సన్నగా నవ్వుతూ; ''ఎందుకూ ? ఇంతవరకూ వారం రోజుల అద్దె ఎగగొట్టావ్! రేప్పొద్దుట రిషానికూడా అమ్ముకు దొబ్బుదామనా?'' అని చరచర వెళ్ళిపోయాడు.

సింహాచలం అతన్నొదిలేసి రిషావెంట పరుగెత్తుతూ ''ఒరే రాజిగా నీకూ కనికరం లేద్రా?.. నువ్వూ నాలాంటి అద్దె రిషావాడివే. రిషాని తీసికెళ్ళకురా, నాయనా! దాన్ని అయిదు సంవత్సరాల నుంచీ తొక్కుతున్నాన్రా తండ్రీ. రోజు గడవదురా, బాబూ!'' అని అరుసుకుంటూ దూరమవుతున్న రిషా వెంబడి పరుగెత్తుతున్నాడు. పరుగెత్తి పరుగెత్తి మరీ పరుగెత్తలేక రొప్పుకుంటూ రోడ్డుప్రక్కన తూము మీద కూర్చున్నాడు. కళ్ళుమూసుకొని మనస్సులో కుమిలి కుమిలి ఏడ్చాడు చాలా సేపు. తరవాత లేచి ఎక్కడెక్కడో తిరిగాడు ఎటేటో ఆలోచించాడు. చీకటి పడుతున్న కొద్దీ కడుపులో ఆకలి దహించివేస్తోంది. నెమ్మదిగా కాళ్ళీడ్చుకుంటూ ఇంటి ముఖం పట్టాడు.

ఇల్లు దగ్గరౌతున్న కొద్దీ గుండెలు దడదడలాడుతున్నాయి. ఇంట్లో అడుగు పెట్టీ పెట్టడంతోనే ''నూకలు తెచ్చావా.. ఇయ్యేల కూడా తేనేదా.. ఒక పన్జెయ్యి. నన్ను ముక్కలుగోసి ఉడకేసుకు తినియ్యి. అప్పుడు నీ పేణం సుకంగా ఉంటాది''. అని కస్సుమంటూ లేస్తుంది పెళ్ళాం. ''రేత్రంతా గొణుక్కుంటూ నా పేనం తినేస్తాది. నేను ఎన్నెన్ని కష్టాలు పడుతున్నానో దానికి తెల్దు''. అని పెళ్ళాన్ని మనస్సులో తిట్టుకుంటున్నాడే గాని ''అవును, అది మాత్రం ఏటి చేస్తాది? ఎన్నాళ్లని ఈ పస్తులు పడగలదు! గెంజి నీళ్ళకి ఆలికాడ ఈల్లికాడ ఎరువు తెమ్మంటే ఎన్నాళ్ళని తెస్తాది ఆడది! ఒవురిస్తారు?'' అని కూడా ఒకవైపు బాధ పడుతున్నాడు. ''చీ, చీ, ఏం బతుకు!'' అని బితుకు బితుకుగా సందు మలుపు తిరుగుతోంటే పైడితల్లి దూరాన్నుంచే సింహాచలాన్ని చూసి పరుగెత్తుకుంటూ వచ్చి ''ఏం దద్దా, ఎక్కడెక్కడ తిరుగుతున్నావ్? నీ కోసం ఊరంతా తిరుగు తున్నాం. పదపద. ముసిల్దానికి ఒంట్లో సుకంనేదు.. మాటామంతీ నేదు...ఎగూపిరి కూడా తన్ను కొస్తుంది. ఆసుపత్రి కి తీసికెల్లాల. నీ రిషా ఎక్కడెట్టావ్; పత్రా బేగి!'' అని గాబరా గాబరాగా చెప్పాడు.

సింహాచలం మాట్లాడకుండా అదోమాదిరిగా ఎక్కడెక్కడో చూస్తున్నాడు.

''ఏదీ, నీ రిక్షా ఏదీ? ... మన్ను తిన్న పాములా మాటాడవేం? అటు ముసిల్ది సచ్చిపోతుంటేనూ!''

''నా రిషా ఏట్రా? అది అద్దె బండిరా.. అలు తీసుకున్నారు.. నిజంగా సచ్చిపోద్దేట్రా?'' అని శూన్యంలోకి చూస్తూ వడగాలి దెబ్బకి టపటపకొట్టుకుంటూ పడిపోతున్న పిట్టలా సింహాచలం తూలుతూ కూర్చొబడిపోయాడు.. దూరంనుంచి సన్నని ఏడుపులు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

''ఏటి ఆ ఏడుపులు.. ముసిల్దానికి తొందర చేస్తుంది గావాల. పదపద.'' అని సింహాచలాన్ని

రెక్కపట్టుకొని లేవనెత్తి గబగబ తీసుకెళ్ళాడు పైడి తల్లి.

గుడిసె ముందు జనం మూగున్నారు.

సింహాచలాన్ని చూడగానే ఒక ముసిల్ది గొల్లుమంది. ''ఓరన్నో, సింవచెలమో! ఒచ్చినావ్రా నాయినా! లచ్చిమమ్మతల్లి మనల్ని ఒగ్గేసిందిరోయ్. ''ముసిలోడు ఇంకారానేదా. ఇంకారానేదా'' అని మూడుబెక్కులు బెక్కేసింది రోయ్!'' అంటూ ఏడుస్తూ సింహాచలానికి ఎదురెళ్ళి పట్టుకొచ్చి కూర్చోబెట్టింది.

సింహాచలం పెళ్ళాం శవం ప్రక్కన కూర్చున్నాడు .

శవం తలదగ్గర నూనె దీపం కాలుతోంది .

ఇంటికెదురుగా మర్రి చెట్టుక్రింద ప్రమిద వెలుగులో మరిడమ్మ నెత్తురుముద్దలా వుంది.

సింహాచలం మాట్లాడటంలేదు . అదేపనిగా పెళ్లాం ముఖంలోకి చూస్తున్నాడు . లోతుకు పోయిన కళ్ళు సగం తెరచి ఉన్నాయి. దవడల మీద తోళ్లు వేలాడుతున్నాయి. ఆకలితో కృశించి పోయి చచ్చిపోయిన బల్లిలా లచ్చమ్మ శవం చాపకి అంటి పెట్టికొనుంది.

లచ్చమ్మని చూస్తున్న కొద్దీ సింహాచలం దుఃఖం కట్టలు తెంచుకుంటోంది. అణచుకొని అణచుకొని ఒక్కసారి గొల్లున ఏడ్చాడు. ''లంజికూతురు ఎర్రి బేపి నాగ కొరికేసేది'' అని పెళ్ళాం శవం మీద పడి అరవై సంవత్సరాల సింహాచలం ఏడుస్తోంటే గొంతుకు కోసిన గొడ్డు అరుస్తున్నట్లుంది.

''చూశావా ఇచిత్రం , బతుకంతా రిషానాగడంతోనే అయిపోయిన సింహాచలానికి; పెళ్ళానికి ఆసపత్రికి తీసికెల్లడానికి రిషానేకపోనాది''. అంటున్నాడు పైడి తల్లి ప్రక్కవాడితో.

''ఇశ్శీ! ఏం కష్టం ఒచ్చిందిరా ముసిలోడికి! సచ్చిపోయింది సచ్చిపోయింది గాని రేపట్నించి ఈ ముసిలోడి గతిచూడు. ఈడికి మరెవరూ లేరు. ఈడికి గెంజికాసేదెక్కేనేదు . చూసుకో ఇంకీడి గతి !'' అంటున్నారింకెవరో.

''దిక్కులేనోడికి దేవుడేదిక్కు . ఆడి కష్టం మీ ఆడు బతకనేడా ? ఆడికి మరిడమ్మ తల్లి, సత్తెమైన దేవత ఓ మంచి సూపు సూడకపోద్దా?'' అని ఏడుస్తున్న సింహాచలానికి ఓదారుస్తోంది, ప్రక్కనున్న ముసిల్ది.

అది విన్న సింహాచలం; అంతవరకు హృదయ విదారంగా ఏడుస్తున్న సింహాచలం; అమాంతంగా ఆవేశంతో ఊగిపోతూ లేచి ముసిల్దానికి ఒక్కతన్ను తన్నాడు. ముసల్ది వెల్లకితలా పడిపోయింది. అందరూ నిర్ఘాంతపోయి నోళ్లు అప్పగించి చూస్తున్నారు.

''మరిడమ్మ చూస్తాదా, ఓసి పిచ్చిలంజా?.. అది రాతిబొమ్మే. అదేటి సేస్తాదే? దానికి కల్లుంటే ఈ రోజు నాకింత గోరం జరిగిపోతుంటే సూస్తూ ఊరుకుంటాదా?... ఇది దేవతా?.. దీన్నిప్పుడే ముక్కలుముక్కలు చేస్తాను..ఏటి జేస్తాదో సెయ్యమను. అంటూ గావుకేకలుపెట్టుకుంటూ తొడలు చరుచుకుంటూ మర్రిచెట్టుక్రిందకి పరుగెత్తాడు. కాండ్రించి తుపుక్కున ఉమ్మిదీపాన్ని ఆర్పేసాడు. మరిడమ్మ విగ్రహాన్ని గభీగభీమని కాళ్ళతో తంతున్నాడు. ''నువ్వు దేవతవైతే దిగిరాయే! దిగిరాయే''! అని ప్రక్కనున్న బండరాయి తీసుకొని విగ్రహాన్ని బలం పూర్తిగా ముక్కలు ముక్కలు క్రింద పగలగొడ్తున్నాడు.

సింహాచలానికి మతి చలించిందనుకున్నారు.

ఆ చప్పుడికి మర్రి చెట్టుమీద ఊగుతున్న గబ్బిలాలు మందలు మందలుగా లేచి క్రీచ్ క్రీచ్ మని అరుచుకుంటూ రెక్కలు కొట్టుకొంటూ దెయ్యపు పిల్లల్లా ఎగురుతున్నాయి.

గుడిసెలో నూనె దీపం గిలగిలా కొట్టుకుంటుంటే, లచ్చమ్మ శవం నీడ కూడా గోడమీద పడి చచ్చిపోయిన లచ్చమ్మ అత్మలా గిలగిలా తన్నుకొంటోంది.

ఆకాశం మీద చుక్కలు బిక్కు బిక్కుమని మిణుగుకుంటూ చూస్తున్నాయి.

★

**( ఈనాడు; డెయిలీ : 15-8-1974)**